సాక్షి
ఒడిశా
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,75,555
బంగారం 1 గ్రాము 280 మిల్లీ గ్రాములు
వెండి 20 గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

నా ఓటు.. నా హక్కు



ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు ఎన్నికల సంఘం తన వంతు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా కరోనా తాకిడితో మరుగున పడిన పథోత్సవాన్ని శనివారం నిర్వహించింది.

- 8లో



ఢిల్లీకి అమృత్ కలశ యాత్ర రైలు

ఆజాదీ కా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం అమృత్ కలశ యాత్ర ప్రత్యేక రైలు ప్రారంభమైంది.

- 8లో

న్యూస్‌రీల్

యువతి మృతదేహం లభ్యం


సంధ్యారాణి(ఫైల్)

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడలోని ఒక క్వార్టర్స్ లో బొరిగుమ్మ సమితి రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న సంధ్యారాణి నాయిక్ మృతదేహం లభించింది. క్వార్టర్స్‌లో వాసన వస్తుండడంతో సమితి స్టాఫ్ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వచ్చి తలుపులు తెరవగా లోపల ఫ్యాన్‌కు ఉరిపోసుకున్న యువతి మృతదేహం కనిపించింది. ఆమె మృతి చెంది వారం రోజులకు పైనే అయ్యుంటుందని అనుమానిస్తున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి దసరా సెలవులు కావడంతో కాలనీలో ఎవరూ లేకపోవడం వలన విషయం తెలియలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపామని, అనంతరం ఆమె బంధువులకు అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు. సంధ్యారాణి మరణం విషయం తెలియడంతో ఆమె తల్లిదండ్రులకు, ఇతర బంధువులు బొయిపరిగుడ వచ్చారు. అయితే ఆమె ఆత్మహత్య చేసుకుందా లేక మరేమైనా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివాహిత మృతదేహం స్వాధీనం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో ఒక బ్రిడ్జి వద్ద వివాహిత మృతదేహాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు రత్తాపాదొరా గ్రామానికి చెందిన పూర్ణా జొడియా భార్య ధొనేయి జొడియా (31)గా పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్ణా కొద్ది నెలల క్రితం ఉపాధి కోసం పొరుగు రాష్ట్రం వెళ్లాడు. ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలు ఉంటున్నారు. అయితే గత రెండు రోజులుగా ధొనేయి ఎటు వెళ్లిందో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో కాసీపూర్‌లోని ఒక బ్రిడ్జి కింద ఉరి వేసుకుని ఉన్న ధొనేయి మృతదేహాన్ని కనుగొన్నారు. అయితే ఇది హత్యా లేక ఆత్మహత్య అనే అనుమానాలు వ్యక్తమవుతుండడంతో పోలీసులు ఈ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు


అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలోని అస్కా, పురుషోత్తపూర్, పట్టపూర్ మరియు కబిసూర్యనగర్ తదితర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న దోపిడీ ఘటనలకు సంబంధించి 9 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దిగపండి పోలీసుస్టేషన్‌లో ఎస్పీ సార్వణ్ వివేక్ శనివారం మాట్లాడుతూ.. గత వారం రోజులుగా వరుసగా గంజాంలో దోపిడీలు చోటుచేసుకుంటున్నాయన్నారు. దీంతో పక్కాగా దర్యాప్తు చేపట్టి దిగపండి పోలీసులు 9 మంది ముఠాను అరెస్టు చేసినట్లు తెలియజేశారు. అరెస్టైనవారి దగ్గర నుంచి 3 కత్తులు, 2 తుపాకీలు, ఒక పంచ్, 5 బులెట్లు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. వారిని బరంపురం ఎస్‌డీజేఎం కోర్టులో హాజరుపరిచి, జైలుకు తరలించినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి


లారీ కిందపడి మృతి చెందిన బాలిక

పాయకరావుపేట(అనకాపల్లి జిల్లా): జాతీయ రహదారిపై లారీ ఢీ కొట్టడంతో బాలిక మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎస్.రమేష్ తెలిపారు. శనివారం జరిగిన విషాద ఘటన వివరాలివి. ఒడిశా రాష్ట్రం గుడియాల గ్రామానికి చెందిన నీలకంఠ నహక్ అనే వ్యక్తి కూలి పని కోసం స్వగ్రామం నుంచి మోటారు బైక్‌పై తన భార్య, కుమార్తెతో బయల్దేరాడు. ఏలూరులో గల స్వర్ణలత దారాల ఫ్యాక్టరీలో పనిచేయడం కోసం వెళ్తున్నారు. స్థానిక జాతీయ రహదారిపై బైక్ పక్కన నిలుపుదల చేసి మంచినీరు తాగుతుండగా అదే సమయంలో అతి వేగంగా ప్రయాణిస్తున్న లారీ ఆ బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో బైక్ మీద కూర్చున్న అతని కుమార్తె మమ్మీల్ని (6) బైక్‌పై నుంచి ఎగిరి లారీ కిందపడింది. టైరు కింద పడిపోవడంతో బాలిక తలభాగం, చేతిభాగం చితికిపోయి మరణించింది. బాలిక మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

కొయ్యకుండానే కన్నీళ్లు..!



- ఘాటెక్కిన ఉల్లి ధర
- నెల రోజుల్లో రెట్టింపు
- మరో నెల రోజుల వరకు కొనసాగే అవకాశం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఉల్లి ధర బెంబేలెత్తిస్తోంది. ఒక నెలలోనే ధర రెట్టింపు అయ్యింది. నాసిక్ నుంచి ఉల్లి సరఫరాలో అంతరాయం కారణంగా నిత్య వినియోగ వంట పదార్థం ఉల్లి కిలో రూ.50–60లకి విక్రయిస్తున్నారు. నగరంలో కొన్నిచోట్ల వ్యాపారులు కిలో ఉల్లిని రూ.80కి విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఉల్లితో నిత్య భోజనం ముగించే బడుగు వర్గాలు రాష్ట్రంలో పలు కుటుంబాలు ఉన్నాయి. సగటు జీవికి ఈ పరిస్థితి కంటతడి పెట్టిస్తోంది.

కొత్త ఉల్లి వస్తేనే..

ఒడిశా వ్యాపారుల మహా సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్ పండా మాట్లాడుతూ.. దాదాపు ప్రతీ సంవత్సరం ఆగస్టు నుంచి నవంబర్ నెల వరకు ఉల్లి ధరలు పెరుగుతాయన్నారు. నవంబర్ 15 నాటికి బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్త ఉల్లి మార్కెట్‌లోకి వస్తే ధర తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఏడాది ఉల్లి పంట చేతికి అందడంలో స్వల్ప జాప్యం చోటు చేసుకునే అవకాశం ఉన్నందున డిసెంబర్ వరకు ఉల్లి ధర పెరుగుదల తప్పదని మరోవర్గం అభిప్రాయపడింది. కొరత సమయంలో ఉల్లిని అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయించడాన్ని వ్యాపార సంస్థలను వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి తప్పుబట్టారు. ఈ చర్యలపై ప్రభుత్వం చోద్యం చూస్తోందని కూరగాయల చిల్లర వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిల్వలు, ధర పెంపుపై బాధ్యులైన వారికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టడంపై ప్రభుత్వం మౌనం ప్రదర్శించడం విచారకరమని పేర్కొన్నారు.

రోజుకు 1,500 టన్నుల వినియోగం

రాష్ట్రంలో నిత్య వినియోగానికి సగటున రోజుకు 1,500 టన్నుల ఉల్లిపాయల అవసరం ఉంటుంది. వినియోగదారుల వ్యవహారాల విభాగం సమాచారం ప్రకారం ఉల్లిపాయ సగటు హోల్‌సేల్ ధర అక్టోబర్ 1 నాటికి క్వింటాల్ రూ.2,506.62 ఉండగా, అక్టోబర్ 26న క్వింటాల్ ధర రూ.3,112.6కి చేరుకుంది, మహారాష్ట్రలోని లాసల్‌గావ్ హోల్‌సేల్ మార్కెట్‌లో సగటు ధర గత రెండు వారాల్లో దాదాపు 60 శాతం పెరిగింది. ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 25న 40 శాతం సుంకాన్ని విధించింది. రానున్న పండగల సీజన్‌లో దేశీయ సరఫరాలను మెరుగుపరచడానికి మరియు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఈ సుంకాన్ని విధించింది. ఆలస్యమైన ఖరీఫ్ పంటల సాగు తగ్గడంతో ధరలు పెరగడం అనివార్యమైనట్లు భావిస్తున్నారు. ఉల్లి ధర పెరుగుదలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం నాఫెడ్ ద్వారా సేకరించిన ఉల్లిని, ప్రస్తుత మార్కెట్ ధరల కంటే తక్కువగా టోకు మార్కెట్‌లలో విక్రయించనుంది. సాధారణంగా కార్తీక మాసం ఆరంభం నాటికి మార్కెటులోకి కొత్త ఉల్లి చేరాల్సి ఉంది. ఈ ఏడాది ఈ పరిస్థితి లేకపోవడంతో ధరలు చుక్కలను తాకుతున్నట్లు కటక్ నగరం ఛత్రబజార్ వ్యాపారుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఉల్లి పంటకు గండి పడడంతో రాష్ట్రంలో ఉల్లి కొరత తలెత్తింది. ఈ పరిస్థితి కుదుట పడేందుకు మరో నెల రోజులు పడుతుందని ఈ వర్గం అంచనా. ఈ లెక్కన ఉల్లి ధర ఇప్పట్లో తగ్గే అవకాశం లేనట్లు స్పష్టమవుతోంది.

నియామక పత్రాలు అందజేత


భువనేశ్వర్‌లో నియామక పత్రాలు అందుకున్న యువతతో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: రాష్ట్రంలో వేర్వేరు చోట్ల శనివారం రోజ్‌గార్ మేళా కార్యక్రమం జరిగింది. జాతీయ స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 39 వేర్వేరు ప్రదేశాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు 51,000 మందికి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్రంలో కటక్ మరియు భువనేశ్వర్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్తగా చేరినవారికి 172 మందికి ఉద్యోగ నియామక పత్రాలను కేంద్ర విద్య మరియు నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యక్షంగా పంపిణీ చేశారు. కటక్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యుడు భర్తృహరి మహతాబ్ ఈ పత్రాలను అర్హులైన అభ్యర్థులకు పంపిణీ చేశారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాల్లో కొత్తగా చేరేందుకు 81 మందికి నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఇలా తూర్పు కోస్తా రైల్వే పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖల కింద మొత్తం 367 మంది యువకులకు వివిధ పోస్టులకు నియామక పత్రాలు అందించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో కొత్తగా నియమితులైన వారందరికీ కర్మయోగి ప్రారంభ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ఓరియంటేషన్ కోర్సు ద్వారా కొత్తగా నియమితులైన వారు శిక్షణ పొందే అవకాశాన్ని కూడా పొందుతారని తెలిపారు.

ప్రారంభమైన గజలక్ష్మి పూజలు


రాయగడ: సబ్ కలెక్టర్ కూడలిలో కొలువుదీరిన అమ్మవారు


రాయగడ: లక్ష్మీ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: నగరంలోని పలుచోట్ల గజలక్ష్మి దేవి పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. జయపురం పట్టణం వల్లభాయి పటేల్ మార్గంలోని రఘునాథ్ మందిరం జంక్షన్‌లో గజలక్ష్మీ దేవి పూజలు నిర్వహించారు. కొన్ని దశాబ్దాలుగా ప్రతి ఏడాది బంకమఠంలో గజ లక్ష్మిదేవి పూజలు చేయడం జరుగుతోంది. అదేవిధంగా ప్రస్తుతం కూడా పూజలు చేస్తున్నారు.

రాయగడ: స్థానిక న్యూ కాలనీలో ఈ ఏడాది గజలక్ష్మి పూజలు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సన్నద్ధమయ్యింది. దీనిలో భాగంగా ప్రధాన అర్చకుల బృందం నాగావళి నది నీటిని కలశాలతో శనివారం తీసుకొచ్చి మండపం శుద్ధి కార్యక్రమాలతో పూజలకు శ్రీకారం చుట్టారు. నవంబరు 7వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ కూడలి, లక్ష్మీదేవి మందిరాల్లో పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి.


రాయగడ: నాగావళి నదీ జలాలను తీసుకొస్తున్న అర్చకుల బృందం


జయపురం: రఘునాథ్ మందిరం జంక్షన్‌లో కొలువైన గజలక్ష్మి దేవి

30 మంది పేకాటరాయుళ్లు అరెస్టు


రాయగడ: అంబొదల పోలీసులు అరెస్టు చేసిన నిందితులు


బరంపురం: దిగపండిలో అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు


బరంపురం: సదర్ పోలీసులు అరెస్టు చేసిన పేకాటరాయుళ్లు


బరంపురం: హరదాఖండి జంక్షన్‌లో అరెస్టైన వ్యక్తులు


బరంపురం: గాంధీనగర్ జంక్షన్‌లో పట్టుబడిన పేకాటరాయుళ్లు

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న జూదం అడ్డాలను నియంత్రించేందుకు ఎస్పీ సర్వాణ్ వివేక్ ఒక ప్రత్యేక పోలీసు అధికార బృందాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఈ బృందం జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి నిర్వహిస్తున్న జూదం అడ్డాలపై దాడులు నిర్వహించి, 30 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.2,85,547 నగదు, 22 సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

రాయగడలో...

జూదం తరహా గుడిగుడి ఆటను నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను జిల్లాలోని అంబొదల పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో చంద్రపూర్ సమితి కొరాపాస గ్రామానికి చెందిన ధనుపూల్ హికక, మునిగుడ సమితి బొడొముద్ర గ్రామానికి చెందిన బొటొ కులిసిక, గుడారి సమితి పాపిఖాల్ గ్రామానికి చెందిన సునీల్ హికకలు ఉన్నారు. కొద్ది రోజులుగా అంబొదల సమీపంలోని మేరింగి తరణీ మందిరం ప్రాంతంలో జూదం తరహా గుడిగుడి ఆటలను నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడులను నిర్వహించారు. ఈ క్రమంలో వారి నుంచి ఆట వస్తువులతో పాటు రూ.34,840 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ ఉమాకాంత సాబొరా తెలియజేశారు.

శిశువుని ఎత్తుకుపోయేందుకు యత్నం

- వ్యక్తి అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు కృష్ణ సాగర్

జయపురం: తాను అత్యాచారం చేసిన యువతికి పుట్టిన 5 నెలల శిశువుని ఎత్తుకుపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసులు శనివారం తెలియజేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. జయపురం బాపూజీనగర్‌కు చెందిన మున సాగర్ కుమార్తె గురువారి సాగర్(30) కృష్ణ సాగర్ అనే వ్యక్తి తనను రేప్ చేయడంతో గర్భం దాల్చినట్లు గతేడాది డిసెంబర్ 12వ తేదీన పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఆ సమయంలో కృష్ణ సాగర్ ఆమెను అంగీకరించలేదు. అప్పట్లో గురువారి ఫిర్యాదు మేరకు కృష్ణ సాగర్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. కాగా 20 రోజుల క్రితం కృష్ణ సాగర్ బెయిలుపై విడుదల అయ్యాడు. దీంతో ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో గురువారి తన 5 నెలల బిడ్డతో జయపురం కోవిడ్ ఆస్పత్రికి వెళ్లింది. ఆ సమయంలో కృష్ణ సాగర్ ఒక స్కూటర్‌పై వచ్చి ఆమె 5 నెలల శిశువును కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించాడని, అయితే ఆమె అరవడంతో బిడ్డను రక్షించుకుందని పోలీసులు వెల్లడించారు. తనపై పెట్టిన కేసును విత్‌డ్రా చేసుకోవాలని ఆమెను హెచ్చరించాడని, అప్పటికే ప్రజలు గుమిగూడడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని, కేసును దర్యాప్తు అధికారి ఏఎస్‌ఐ సత్యబాది నాయిక్ దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. నిందితుడు కృష్ణ సాగర్‌ను అరెస్టు చేసి కోర్టుకు పంపించడం జరిగిందని వెల్లడించారు.

చలిపులి

భువనేశ్వర్: రాష్ట్రంలో శీతాకాలం ప్రారంభమైంది. గత 2 రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా దిగజారుతున్నాయి. గత 24 గంటల్లో 5 పట్టణ ప్రాంతాల్లో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదైంది. ఈ జాబితాలో జి.ఉదయగిరి, ఫుల్బాణి, కొరాపుట్, దారింగ్‌బాడి, కొరై ప్రాంతాలు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నమోదైన కనిష్ట ఉష్ణోగ్రత వివరాలు పరిశీలిస్తే...

కొన్నిచోట్ల తేలికపాటి వర్షం

రానున్న 4 రోజుల పాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ సమాచారం. బంగాళాఖాతంలో నెలకొన్న వాతావరణం ప్రభావంతో నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు దక్షిణ ఒడిశాలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ శాఖ ముందస్తు సమాచారం జారీ చేసింది.

ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
జి.ఉదయగిరి	13.5
ఫుల్బాణి	14
కొరాపుట్	14
దారింగ్‌బాడి	14
కొరై	14.4
సిమిలిగుడ	15
అంగుల్	16
భవానీపట్న	16
కెంజొహర్	16.4
సోన్‌పూర్	16.19
నవరంగ్‌పూర్	17.4
రౌర్కెలా	18.2

సందడే.. సందడి


ఒడిస్సీ నృత్య ప్రదర్శన చేపడుతున్న స్థానిక కళాకారులు


ఆకట్టుకుంటున్న స్థానిక కళాకారిణుల ప్రదర్శన


గంజా జిల్లా సంప్రదాయ జోడి శంఖో నృత్యాలు




గౌరవ అతిథులను సత్కరిస్తున్న దృశ్యం

రోజురోజుకీ కనుమరుగవుతున్న గ్రామీణ సాంప్రదాయలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఒడిశా భాష సంస్కృతి డైరక్టర్ దిలీప్ రౌత్‌రాయ్ అన్నారు. స్థానిక ఐటీఐ బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో మధుమయి పాణిగ్రాహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుమార పౌర్ణమి సందర్భంగా సంస్కృతిక కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్ రౌత్‌రాయ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల సాంప్రదాయ క్రీడలు, నృత్యాలు కనుమరుగవుతున్న సమయంలో గత 10 ఏళ్లుగా మధుమయి ఫౌండేషన్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. గంజాం జిల్లా కళలు, సాంప్రదాయాలకు పుట్టినిళ్లు అని అభివర్ణించారు. జిల్లా సంప్రదాయ జోడు శంఖో ధ్వనులు, భరతనాట్యం, కూచిపూడి వంటి కళలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆల్ ఇండియా డైరెక్టర్ డా.రుశికేష్ పాణిగ్రాహి, ప్రొఫెసర్ సుదర్శన్ అచార్య తదితరులు పాల్గొన్నారు.

– బరంపురం

క్లుప్తంగా

30న సప్తస్వర అవధానం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శంకరశర్మ, మండవల్లి రవి తదితరులు

అరసవల్లి: శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో ఈనెల 30న స్థానిక బాపూజీ కళామందిర్‌లో గిన్నిస్ రికార్డు గ్రహీత స్వరవీణాపాణి ఆధ్వర్యంలో సప్తస్వర అవధానం కార్యక్రమం జరుగుతుందని శ్రీసుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు. ఈ మేరకు అరసవల్లిలో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కార్యక్రమానికి సంబధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన స్వర వీణాపాణి మీ మాట–నా పాట– పాట పుట్టుక అనే అవధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, ఈ మేరకు సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నామని, ప్రజలు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసుమిత్ర కళాసమతి సభ్యులు మండవిల్లి రవి, గుత్తు చిన్నారావు, ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

'అతిమంగా న్యాయమే గెలుస్తుంది'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోన్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: చంద్రబాబు ఎల్లకాలం వ్యవస్థలను మేనేజ్ చేయలేరని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆయన శనివారం ఆమదాలవలసలో గల జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైకోర్టులో చంద్రబాబు మధ్యంతర అత్యవసర బెయిల్ పిటిషన్ జస్టిస్ జ్యోతిర్మయి వద్ద నుంచి తప్పించాలని ఇప్పటివరకు కేసుతో ఎలాంటి సంబంధం లేని జీవీఎల్ మూర్తి అన్న ఒక న్యాయవాదితో చంద్రబాబు పిటీషన్‌కు వకాలత్ వేయించి, విలువలకు కట్టుబడిన జస్టిస్ జ్యోతిర్మయితో 'నాట్ బిఫోర్ మి' అని చెప్పించుకున్నారని వివరించారు. దీన్ని బట్టే చంద్రబాబు వ్యవస్థలను ఎంతలా మేనేజ్ చేయాలని చూస్తారో అర్థమవుతుందన్నారు. కానీ చంద్రబాబు పప్పులు ఇక ఉడకవని అన్నారు. పార్టీ కార్యకర్తలు కెప్టెన్ పైడి రామారావు, అన్నెపు కృష్ణ, రామ్మోహన్, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన



పలాస కిడ్నీరీసెర్చ్ సెంటర్ బీటీ రోడ్డు పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్ నాయక్

కాశీబుగ్గ: పలాసలో నూతనంగా నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌ను పలాస రెవెన్యూ డివిజన్ అధికారి భరత్ నాయక్ శనివారం పరిశీలించారు. ఏ–బ్లాక్, బి–బ్లాక్‌తో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎంఆర్‌స్కాన్, సిటి స్కాన్ వంటి వివిధ విభాగాలను పరిశీలించారు. మున్సిపాలిటీ వారు నిర్మిస్తున్న బీటీ రోడ్డు ఆలస్యం కావడంతో సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఆయనతో పాటుగా పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావు, ఆర్ నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో నరకాసుర సినీ బృందం సందడి

కాశీబుగ్గ: 'పలాస 1978' ఫేమ్ రక్షిత్ నటించిన మరో సినిమా నరకాసుర వచ్చే నెల 3వ తేదీన విడుదలవుతున్న సందర్భంగా శనివారం రాత్రి ప్రీరిలీజ్ ముందస్తు సమావేశం పలాసలో నిర్వహించారు. పలాసను సెంటిమెంట్‌గా భావించి తొలి కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. హీరో రక్షిత్ మాట్లాడుతూ తన కెరీర్ ఇక్కడే ప్రారంభమైందని, ఎన్ని సినిమాలు చేసినా పలాస వచ్చి కొబ్బరికాయ కొట్టి వెళ్తానని అన్నారు. అనంతరం హీరోయిన్లు సంగీత, అపర్ణలతో స్టేజీపై డ్యాన్స్ చేశారు. డైరెక్టర్ సెబాస్టియన్, పలాస నటులు గార రాజారావు, రవిశంకర్ యజమాని తంగుడు వీర్రాజు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏటా జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్, తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారం జరగనున్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా నేడు జరగనున్న ఈ అథ్లెటిక్స్ మీట్‌కు దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం నాలుగు వయో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ ఏడాది అథ్లెటిక్స్‌తోపాటు తైక్వాండో క్రీడలోను పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం కల్పించారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాల్సి ఉంటుంది.

నా ఓటు.. నా హక్కు

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన అస్త్రం. ఓటు హక్కు సద్వినియోగంతో మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం చేయడం సాధ్యం. ఈ దిశలో యువతరం ముందడుగు వేయాల్సి ఉంది. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు ఎన్నికల సంఘం తన వంతు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా కరోనా తాకిడితో మరుగున పడిన పథోత్సవాన్ని మరోసారి ఆచరణలోకి తీసుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సెలబ్రెటీలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ), ప్రచార రాయబారులు, సాధారణ పౌరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: పథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



భువనేశ్వర్: ఎన్నికల సంఘం ఓటరు చైతన్య వాక్‌థాన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



భువనేశ్వర్: ఓటు వినియోగంపై చైతన్య రంగవల్లి



భువనేశ్వర్: ఓటరు చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



భువనేశ్వర్: నా ఓటు–నా అధికారం నినాదంతో మువ్వన్నెల ముగ్గు



భువనేశ్వర్: ఓటుహక్కు సద్వినియోగం చైతన్య కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెటు



భువనేశ్వర్: ఎన్నికల సంఘం పతాకం ఊపి వాక్‌థన్ ప్రారంభించిన సీఈవో నికుంజో బిహారి ధొలొ



రాయగడ: ఓటరు జాబితాను రాజకీయ నాయకులకు అందిస్తున్న అధికారులు



మల్కన్‌గిరి: ఓటు హక్కుపై అవగాహన వీడియో ప్రారంభిస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



మల్కన్‌గిరి: రహదారిపై ముగ్గులు వేస్తున్న మహిళలు



మల్కన్‌గిరి: సంబల్‌పూర్ నృత్యాలు చేస్తున్న చిన్నారులు



మల్కన్‌గిరి: ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



పర్లాకిమిడి: వాకథాన్ ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రధాన్



పర్లాకిమిడి: పట్టణంలో విద్యార్థుల వాక్‌థాన్



పర్లాకిమిడి: వివిధ పార్టీల నేతలతో సవరించిన ఓటరు జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రధాన్



జయపురం: ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జయపురం: అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు



జయపురం: పథోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు



మల్కన్‌గిరి: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు



జయపురం: ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేస్తున్న దృశ్యం



రాయగడ: వాక్‌థాన్ ప్రారంభిస్తున్న ఏడీఎం ప్రధాన్ తదితరులు

ఢిల్లీకి అమృత్ కలశ యాత్ర రైలు

- పచ్చజెండా ఊపిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా మేరీ మాటి–మేరా దేశ్ ప్రచార కార్యక్రమం చివరి దశకు చేరుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభమైన ఈ కార్యక్రమం నవంబర్ 1తో ముగియనుంది. ఈ సందర్భంగా శనివారం ఉదయం అమృత్ కలశ యాత్ర ప్రత్యేక రైలు ప్రారంభమైంది. కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పచ్చజెండా ఊపి భువనేశ్వర్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభించారు. ఈ రైలు ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు న్యూఢిల్లీ ఆనంద్ విహార్ టెర్మినల్‌కు చేరుకుంటుంది. రైలులో 1400 మందికి పైగా న్యూఢిల్లీకి పయనమయ్యారు. రాష్ట్రంలో స్వాతంత్ర్య సమర యోధులు, సైనికుల ఇంటి నుంచి సేకరించిన మట్టితో ఢిల్లీకి బయల్దేరారు. దేశ రాజధానిలో రూపొందుతున్న 'అమృత వాటిక'లో ఈ మట్టిని వినియోగించనున్నారు. రాష్ట్రంలో 13,128 గ్రామాల నుంచి సేకరించిన మట్టితో వీరంతా కలశాలను తీసుకెళ్లారు. ఈనెల 30 మరియు 31 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో వీరంతా ప్రత్యక్షంగా పాలుపంచుకుంటారు.



భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో అమృత్ కలశ యాత్ర ప్రత్యేక రైలు

అమరులకు నివాళిగా...

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమర యోధులు మరియు అమర జవాన్లకు నివాళిగా జాతీయ యుద్ధ స్మారక సమీపంలో అమృత వాటికను నిర్మించనున్నారు. ఈ ప్రాంగణంలో 7,500 కలశాలతో సేకరించిన మట్టితో కలిపి మొక్కలు నాటి ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్‌కు గొప్ప చిహ్నంగా అమృత వాటిక నిలుస్తుంది. రాష్ట్రంలో 314 మండలాలు, 2,720 పంచాయతీల నుంచి ఊరేగింపుగా సేకరించిన పవిత్ర మట్టిని శుక్రవారం భువనేశ్వర్‌కు చేరుకుని ఈ ఉదయం భారీ ఊరేగింపుగా రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, బాలాసోర్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ప్రతాప్ చంద్ర షడంగి, బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, ముజిబుల్లా ఖాన్, ఎమ్మెల్యే లలితేందు బిద్యాధర్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు. తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ అతిథులకు స్వాగతం పలికిన కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ శరద్ కుమార్ శ్రీవాస్తవ, ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి (డీఆర్ఎం) హెచ్.ఎస్.బజ్వా తదితరులు పాల్గొన్నారు.



పచ్చజెండా ఊపి అమృత్ కలశ యాత్ర ప్రత్యేక రైలు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



అమృత కలశాలతో న్యూఢిల్లీకి బయల్దేరిన జవాన్లు

ఫేక్ యాప్‌తో టోకరా

పొందూరు:

బిట్‌వెర్స్ యాప్‌లో పెట్టుబడులు పెడి తే ప్రతి రోజు అధిక మొత్తంలో సొమ్ము ఇస్తామంటూ నమ్మబలకడంతో తామంతా నమ్మి పెట్టుబడి పెట్టి మోసపోయామంటూ విశాఖపట్నంకు చెందిన పలువురు బాధితులు వాపోయారు. బిట్‌వెర్స్ క్రిప్టో ఫేక్‌యాప్‌తో పొందూరు మండలం తానెంకు చెందిన బి.శ్రీనివాసరెడ్డితో పాటు, మరో ఇద్దరు తమ నుంచి డబ్బులు తీసుకుని మోసగించారని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు విశాఖకు చెందిన పది మంది బాధితులు తానెం గ్రామానికి వచ్చి శ్రీనివాస రెడ్డి ఇంటి ముందు ఆందోళన చేశారు. తాము రూ.1.26 కోట్లు నష్టపోయామని, తమలాంటి వారు ఇంకెందరో ఉన్నారని తెలిపారు.

యాప్‌లో పెట్టుబడి పెట్టాలని చెబితే తాము తెలియక మోసగాడి ఖాతాకే డబ్బులు పంపించామని, అతను సంబంధిత నగదుకు సమానమైన డాలర్లను బిట్‌వెర్స్ యాప్‌లో బాధితుల ఐడీలకు చేర్చేవాడని, తిరిగి ఆ డాలర్లను అదే యాప్‌లో పెట్టుబడిగా పెట్టేవారమని తెలిపారు. రూ. 8 లక్షలకు పది వేల డాలర్లను యాప్‌లో బాధితుల ఐడీలకు పంపించేవారని చెప్పారు. ఆ పదివేల డాలర్లు తిరిగి అదే యాప్‌లో పెట్టుబడిగా పెట్టడంతో సంబంధిత యాప్ యజమానికే చేరేవని, ఇక్కడే మోసపోయామని చెప్పారు. అదే పది వేల డాలర్లను మిగిలిన వారికి పంపిస్తూ రూ.కోట్లలో మోసానికి పాల్పడ్డాడని చెప్పారు. వీరి ఆందోళనపై సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ రామచంద్రరావు గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. పొందూరు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని వారిని కోరారు. అయితే ఈ నెల 21న ఆమదాలవలసలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. పూర్తిస్థాయి ఆధారాలను సీఐకు సమర్పిస్తామన్నారు. విశాఖ, విజయనగరం, మన్యం జిల్లాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 500 మంది బాధితులు ఉన్నారని ధర్నా చేసిన వారు తెలిపారు.

గ్రహణం ఎఫెక్ట్



పర్లాకిమిడి: మూసివేసిన జగన్నాథ మందిరం

రాయగడ:

చంద్ర గ్రహణం సందర్భంగా స్థానిక మజ్జిగౌరి ఆలయాన్ని శనివారం సాయంత్రం 4 గంటలకు మూసివేశారు. దీంతో నిత్య పూజాదులు నిలిచిపోయాయి. ఆదివారం తెల్లవారు జామున సంప్రోక్షణ అనంతరం తిరిగి యథావిధిగా దర్శనాలు కొనసాగుతాయి.

పర్లాకిమిడి: పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా పట్టణంలోని జగన్నాథ స్వామి మందిరం, శ్రీరామలింగేశ్వర మందిరాలతో పాటు పలు మందిరాలు సాయంత్రం 4 గంటలకు మూసివేశారు. మరలా ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం గుడి తలుపులు తెరుస్తామని పాడుగు కోవెల అర్చకుడు దాస్ తెలియజేశారు.



పర్లాకిమిడి: రాజవీధిలో పాడుగు కోవెల తలుపులు మూసివేసిన దృశ్యం



రాయగడ: మూసివేసిన మజ్జిగౌరి అమ్మవారి మందిరం

క్లుప్తంగా

తప్పిన ఘోర ప్రమాదం



తెర్లాం జంక్షన్‌లో ఢీకొన్న లారీలు

తెర్లాం: తెర్లాం జంక్షన్ వద్ద శనివారం తెల్లవారు జామున ఘోర ప్రమాదం తప్పింది. రాజాం నుంచి రామభద్రపురం వైపు వస్తున్న రెండు లారీలు తెర్లాం జంక్షన్‌లో ఉన్న స్పీడ్ బ్రేకర్లు వద్ద ఢీకొన్నాయి. ముందు వెళ్తున్న లారీ స్పీడు బ్రేకర్ల వద్ద నెమ్మదిగా వెళ్లడంతో దాని వెనక నుంచి వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనకనుంచి వచ్చి ఢీకొన్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. పారాది వంతెన మరమ్మతులకు గురి కావడంతో తెర్లాం మీదుగా భారీ వాహనాలు వెళ్తున్నాయి. రోడ్లు మరమ్మతులకు గురికావడంతో పాటు, ఇలాంటి చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



కోనూరు పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుర్ల: కోనూరు పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని తాటిపూడి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కోనూరు పీహెచ్‌సీ సిబ్బంది అంతా వైద్య శిబిరం వద్దనే ఉండడంతో అందరూ ఇక్కడే ఉంటే పీహెచ్‌సీకి వచ్చే రోగులను ఎవరు చూస్తారని మండిపడ్డారు. తీరు మార్చుకోవాలని సూచించారు. మరోసారి ఇదే పరిస్థితి పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



మృతి చెందిన రమణ

కొత్తవలస: అప్పుల బాధ తాళలేక రైల్వే ఉద్యోగి అర్జి రమణ(31) ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వీరభద్రపురం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ హేమంత్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖపట్నం జిల్లాలోని మర్రిపాలెంలో గ్యాంగ్‌మేన్‌గా పనిచేస్తున్న రమణ గత కొంతకాలంగా మద్యానికి బానిసై, అప్పుల పాలయ్యాడు. శుక్రవారం భార్య స్వాతితో కలిసి దేవరాపల్లి మండలంలోని కలిగట్లు గ్రామానికి అత్తవారింటికి వెళ్లి, ఆ రాత్రికి అక్కడే భార్య, పిల్లలను విడిచిపెట్టి స్వగ్రామమైన వీరభద్రపురానికి రమణ వచ్చాడు. శనివారం ఉదయం 10 గంటల సమయమైనా ఇంట్లో లైట్లు వేసి ఉండడాన్ని స్థానికులు చూసి, అతడి భార్యకు సమాచారం అందజేశారు. ఆమె ఇంటికి వచ్చి, తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని, మృతి చెందిన రమణను చూసి, విలపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శవపంచనామా అనంతరం ఎస్.కోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం కోసం మృతదేహం తరలించారు. మృతుడి సోదరుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఐదేళ్ల లోపు వయసున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ..



ఆస్పత్రిలో పెంటమ్మ మృతదేహం


రామభద్రపురం: పురుగుమందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురై, బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సబ్బరవరపు పెంటమ్మ(19) అనే యువతి శనివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాతరేగకు చెందిన పెంటమ్మ.. ప్రేమించిన వ్యక్తి నమ్మించి మోసం చేశాడన్న మనస్తాపంతో ఈ నెల 22వ తేదీన పురుగు మందు తాగి, ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడే చికిత్స పొందుతుండగా చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సీతానగరం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అదే గ్రామానికి చెందిన కొండమ్మకు వివాహమై, తొమ్మిదేళ్లు అయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా ఆమె తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఎప్పటిలాగే కడుపునొప్పి రాగా ఎప్పుడూ ఇలాగే జరుగుతోందని మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న చీమలమందు తాగి, ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి ఆమెను తరలించి, చికిత్స అందజేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవ కోట.. హుకుంపేట

- గ్రామదేవతగా పైడితల్లి అమ్మవారు
- పండగకు హుకుం జారీ చేసింది ఇక్కడే..
- తొలిపూజలు హుకుంపేటలోనే..
- నాటి పతివాడ పేట.. నేటి హుకుంపేట



హుకుంపేటగా పేరుగాంచిన నాటి పతివాడపేట

విజయనగరం టౌన్: విజయనగరం రాజుల ఆడపడుచు పైడితల్లి అమ్మవారు తొలుత గ్రామదేవతగా పూజలందుకునేవారు. అమ్మవారికి మొదట్లో హుకుంపేటలోనే పూజలు నిర్వహించేవారు. చిన్నారి పైడితల్లి రాజుల ఆడపడుచుగా పతివాడ అప్పలనాయుడు సంరక్షణలో పెరిగింది. ఆ తర్వాత బొబ్బిలి యుద్ధంలో తన అన్న విజయ రామరాజును యుద్ధానికి వెళ్లవద్దని వారించినా, అన్నయ్య తన చెల్లి అయిన పైడితల్లి మాట వినకపోవడం, యుద్ధంలో మృతి చెందడం, ఆ విషయం తెలుసుకున్న పైడితల్లి పెద్దచెరువులో ప్రాణత్యాగం చేసుకోవడం విదితమే. కొద్దిరోజుల తర్వాత పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి, పెద్ద చెరువులో తన విగ్రహం లభ్యమవుతుందని, దానికి పూజలు చేయమని చెప్పడంతో అమ్మవారిని పెద్దచెరువులో నుంచి తీసి, వనంగుడి వద్ద ప్రతిష్ఠించారు. అయితే పతివాడ అప్పలనాయుడు నివాసముండే పతివాడపేట(నేటి హుకుంపేట)లోనే గ్రామదేవతగా అమ్మవారికి పూజలు చేసేవారు. ఆ తర్వాత కాలంలో నేటి రైల్వేస్టేషన్ దగ్గరున్న ఆ ప్రాంతమంతా దట్టమైన అరణ్యప్రాంతం కావడంతో అక్కడ ఉన్న చిన్న గుడికి తక్కువ సంఖ్యలో భక్తులు వచ్చేవారు. కాలక్రమేణా వనంగుడి వెలిసింది. అనంతరం కోట వద్ద చదురు నిర్మించి, అమ్మ వారిని ప్రతిష్ఠించారు. అయితే పురాతనమైన పతివాడపేటను నేడు హుకుంపేటగా పిలుస్తున్నారు.

పతివాడపేటగా ఎలా మారింది..

ప్రస్తుతం ఉన్న హుకుంపేటను ఒకప్పుడు పతివాడపేటగా పిలిచేవారు. పతివాడ అప్పలనాయుడు కలలో అమ్మవారు కనిపించడం.. పతివాడపేటలో అమ్మవారు ఉన్న స్థలాన్ని నాయుడు చెప్పడంతో పైడితల్లి పండగ అక్కడి నుంచే ప్రారంభమైంది. దాదాపు 65 ఏళ్లకు పూర్వమే పతివాడపేటలో గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ చాటింపు ఇంటింటికీ చేసేవారు. అదే సమయంలో వీధి పెద్దలంతా నాటి మహారాజుకు తెలియకుండానే చాటింపునకు హుకుం(ఆదేశాలు) జారీచేశారు. అప్పటి నుంచి పతివాడపేట కాస్త హుకుంపేటగా మారింది.

సిరిమాను అధిరోహించిన వారి వంశవృక్షం..

పైడితల్లి అమ్మవారు పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి, పూజలందుకుంటున్న దగ్గర నుంచి చూసుకుంటే స్థానిక పెద్దలు, పూజారి చెప్పిన వివరాల మేరకు పతివాడ అప్పలనాయుడు ఆయన కుమారుడు పతివాడ భోగినాయుడు సిరిమాను అధిరోహించారు. ఆయన కుమారులు పతివాడ సూర్యనారాయణ, పతివాడ లక్ష్మణనాయుడులు అధిరోహించారు. సూర్యనారాయణకు ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో పెద్దకుమార్తెను బంటుపల్లి సూర్యనారాయణనాయుడు వివాహం చేసుకున్నారు. ఆయన సిరిమాను అధిరోహించారు. అనంతరం ఆయన కుమారుడు బంటుపల్లి వెంకయ్యనాయుడు, తర్వాత బంటుపల్లి బైరాగినాయుడు సిరిమాను అధిరోహించారు. బైరాగినాయుడుకు ఒక ఏడాది ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆయన మేనల్లుడు నేతేటి శ్రీనివాసరావు సిరిమాను అధిరోహించారు. తర్వాత మరలా బైరాగినాయుడే సిరిమాను ఎక్కారు. ఆయన తదనాంతరం బైరాగినాయుడు మరో మేనల్లుడు తాళ్లపూడి భాస్కరరావు సిరిమాను అధిరోహించారు. ఆయన పదవీ విరమణ తర్వాత మళ్లీ బైరాగినాయుడు కుమారుడు బంటుపల్లి వెంకటరావు ప్రస్తుతం సిరిమాను అధిరోహిస్తున్నారు.

హుకుంపేటలో ఘటాలకే పూజలు..

అమ్మవారి పండగ వస్తుందంటే హుకుంపేట వాసులకు పండగే.. పండగ.. పండగకు ముందు మంగళవారం హుకుంపేటలో బాజాభజంత్రీలతో అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీ. అందరూ చందాలు వేసుకుని మరీ భారీ ఊరేగింపుతో ఘటాలతో చదురుగుడికి, వనంగుడికి వెళ్లి, పూజలు చేస్తారు. పండగను అంగరంగ వైభవంగా నిర్వహించి, మొక్కుబడులు చెల్లిస్తారు. బంటుపల్లి వెంకటరావు ఇంటి వద్ద ఉన్న చదురు వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో ఘటాలు పెట్టి మొక్కుబడులు చెల్లిస్తారు.



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రతి ఒక్కరి పండగ..



పైడితల్లి పండగంటే ప్రతి ఒక్కరి పండగే.. ఒకప్పుడు గ్రామదేవతగా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పండగ నేడు రాష్ట్ర పండగగా గుర్తింపు రావడం మనందరి అదృష్టంగానే చెప్పాలి. జిల్లా వాసులందరూ ఈ పండగలో పాల్గొని, తల్లి దీవెనలు పొందాలి. చల్లనితల్లిగా అందరినీ కాపాడుతూ వస్తున్న అమ్మ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. –పతివాడ వెంకటరావు, స్థానికుడు

ఎవరి బాధ్యతలు వారివే...

సిరిమానోత్సవంలో ఎవరెవరు ఏం చేయాలో ముందుగానే నిర్ణయించుకుంటారు. అంజలిరథం ఊరేగింపు కోసం ఆడవేషధారణలతో ఐదు కుటుంబాల వ్యక్తులు పాల్గొంటారు. ఇందులో నడిపేన, గురుబిల్లి, మీసాల తదితర కుటుంబాలకు చెందిన వారు పాల్గొంటారు. తెల్లఏనుగు ఊరేగింపులో గంటలు వాయిస్తూ 900 మంది ఏనుగు రథంతో వచ్చి పూజలందిస్తారు. బెస్తవారి వల ఊరేగింపులో బెస్తవీధికి చెందిన 100 మంది జాలర్లు పసుపు రాసుకుని, అమ్మవారి వెనక నడుస్తారు. పాలధార ఊరేగింపులో సాకేటి వీధికి చెందిన వారు సాముగరిడీలు చేస్తారు. చినరామువరపు పైడిరాజు బృందం ఇందులో పాల్గొంటుంది.

పండగ మర్నాడు అన్నదానం..

సిరిమానోత్సవం పూర్తయిన మరునాడే హుకుంపేటలో పైడిమాంబ స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నసమారాధన జరుగుతూనే ఉంటుంది. గ్రామపెద్దల సహాయ సహకారాలతో, దాతల విరాళాలతో అమ్మపండగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

అమ్మ కోసం నిరీక్షణ..

హుకుంపేటలోని సిరిమాను కదిలిన క్షణం నుంచి పూజారి వీధుల్లో నడుస్తుండగా అందరూ ఆ తల్లి పాదాలను పసుపునీటితో కడిగి, నెత్తిన చల్లుకుంటారు. హారతులిచ్చి, అమ్మకు నీరాజనాలు పలుకుతారు. అమ్మ రాకను సూచిస్తూ డప్పు వాయిద్య కారులు ముందుగా వీధుల్లో చాటింపు వేస్తారు.

మూడు రోజుల పండగ..

వీధి పెద్దలంతా కలిసి సిరిమానోత్సవానికి కొన్ని నెలల ముందు హుకుంపేట రామాలయంలో సమావేశమై, పండగ విధి, విధానాలను ఖరారు చేస్తారు. దేవాదాయ శాఖకు సంబంధం లేని సమయంలో పూజారి ఇంట్లో మూడు రోజుల పండగ మాత్రమే చేసేవారు. ప్రస్తుతం అది కాస్త నెలరోజుల పండగగా నిర్వహిస్తున్నారు. 1980 సమయంలో బంటుపల్లి వెంకయ్యనాయుడు(బైరాగినాయుడు తండ్రి) సిరిమానును అధిరోహించారు. ఆ తర్వాత సిరిమానును అధిరోహించేందుకు సరైన వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో కొత్తవలస నుంచి వెంకయ్యనాయుడు మేనల్లుడుని తీసుకువచ్చి, సిరిమానును అధిరోహింపజేశారు. ఆ తర్వాత 1990 దశకంలో నేతేటి నారాయణప్పడు మూడేళ్ల పాటు సిరిమానును అధిరోహించారు. ఆయన తర్వాత 28 ఏళ్ల పాటు బంటుపల్లి బైరాగినాయుడు సిరిమాను ఎక్కి, అత్యధిక సార్లు సిరిమాను అధిరోహించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. అనంతరం నేతేటి శ్రీనివాస్ సిరిమాను అధిరోహించారు. వారి తర్వాత తాళ్లపూడి భాస్కరరావు దాదాపు పదేళ్ల పాటు సిరిమానును అధిరోహించి, పదవీ విరమణ చేసి, కాలం చేశారు. ప్రస్తుతం దివంగత బంటుపల్లి బైరాగినాయుడు కుమారుడు బంటుపల్లి వెంకటరావు 2017 నుంచి సిరిమాను అధిరోహిస్తున్నారు. ప్రస్తుతం ఏడోసారి ఆయన సిరిమాను అధిరోహించనున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎటర్నటీ జట్టు



ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు

విజయనగరం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా సంబరాల్లో చేపట్టిన క్రికెట్ టోర్నీ పోటీల విజేతగా విజయనగరానికి చెందిన ఎటర్నటీ జట్టు నిలవగా..ద్వితీయ స్థానంలో విజయనగరం వారియర్స్, తృతీయ స్థానంలో విజ్జీ లయన్స్ జట్లు నిలిచాయి. నగరంలోని విజ్జీ స్టేడియంలో గత మూడు రోజులుగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు మొత్తం 11 జట్లు హాజరయ్యాయి. విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతి కింద రూ.15 వేలు, రెండో బహుమతి కింద రూ.10వేలు, మూడో బహుమతి కింద రూ.5 వేలతో పాటు ట్రోఫీలు, జ్ఞాపికలను సెట్విజ్ సీఈవో బి.రామ్‌గోపాల్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బందితో పాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్దానంలో పెద్దపులి భయం

కంచిలి: ఉద్దానంలోకి పెద్దపులి ప్రవేశించింది. కంచిలి మండలం మండపల్లి పంచాయతీ పరిధి అమ్మవారిపుట్టుగ గ్రామం పంటపొలాల్లో పెద్ద పులి పాదముద్రలను స్థానికులు శనివారం గుర్తించారు. మండపల్లికి చెందిన ఒక ఉపాధ్యాయుడు కాశీబుగ్గ అటవీరేంజర్ ఎ. మురళీకృష్ణం నాయుడుకు సమాచారం ఇవ్వడంతో, అటవీ అధికారుల బృందం హుటాహుటిన అమ్మవారిపుట్టుగ గ్రామానికి చేరుకున్నారు. సంబంధిత పొలంలో పాదముద్రలను గమనించి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ద్రావణంతో పాద ముద్రల పరిమాణాన్ని కచ్చితంగా కనుగొని, వాటి పొడవు 16 సెంటీమీటర్లు, వెడల్పు 14 సెంటీమీటర్లుగా గుర్తించారు. గ్రామంలో మాదిన మాదిన చౌదరినాయుడుకు చెందిన పొలంలో ఈ పెద్దపులి పాదముద్రలు లభించినప్పటికీ, ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటుచేసుకోలేదు. ఈ పులి ఒడిశా రాష్ట్ర పరిధి పర్లాఖిమిడి అటవీ ప్రాంతం నుంచి జిల్లాలోకి ప్రవేశించిందని, మూడు రోజులుగా పలాస మండలం లొత్తూరు నుంచి మందస మండలం పట్టులోగాం, కొండలోగాం చేరుకుందని, శుక్రవారం రాత్రికి కంచిలి మండలం అమ్మవారిపుట్టుగ గ్రామంవైపు సంచరించినట్టు తేలిందని కాశీబుగ్గ రేంజర్ ఎ.మురళీకృష్ణం నాయుడు తెలిపారు. ఎవరికైనా పులిసంచారంపై సమాచారం తెలిస్తే వెంటనే తన మొబైల్ నంబర్ (6302267775)కు తెలియజేయాలని కోరారు. పెద్దపులి పాదముద్రలు మండపల్లి పంచాయతీ అమ్మవారిపుట్టుగ గ్రామ పంటపొలాల్లో గుర్తించి, ధ్రువీకరించామని డీఎఫ్‌ఓ నిషాకుమారి తెలిపారు. దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. చుట్టుపక్కల గ్రామాల వారు కూడా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.హైమావతి కోరారు. దీనిపై మండపల్లి పంచాయతీలో స్థానిక సర్పంచ్ మాదిన రజిని ఆధ్వర్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టాంటాం వేయించారు.



పెద్దపులి సంచరించిన పంట పొలాల్లో పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ నిషాకుమారి, మిగతా అధికారుల బృందం

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- గంజాయి, సారా రవాణా, విక్రయాలను నివారించాలి
- సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులపై సమీక్ష చేపట్టి, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణతో కేసులను త్వరగా దర్యాప్తు చేయాలన్నారు. గంజాయి, సారా రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి, బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్ జరగకుండా చూడాలన్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో ట్రయల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు మార్కెటింగ్ చేసుకుంటూ ఉండాలన్నారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరై, న్యాయమూర్తి ఎదుట వాస్తవాలు ఒప్పుకునేలా ధైర్యం కల్పించాలన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్లు భావించకూడదని, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటేనే బాధితులకు న్యాయం జరిగినట్లు అన్నారు. 174 సీఆర్‌పీసీ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేసి, తప్పిపోయిన వారిని త్వరగా ట్రేస్ చేయాలన్నారు. అనంతరం ఓ హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేసిన పాచిపెంట కోర్టు కానిస్టేబుల్ రామ్మోహన్, కంప్యూటర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ వి.రామాంబాబు, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సుజాత, కానిస్టేబుల్ శివకుమార్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్‌డివిజన్ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, పార్వతీపురం డీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న కలెక్టరేట్ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించడం, జాతీయ పతాకాన్ని ఎగురవేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు, వారి సిబ్బందితో కలసి తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, మరి కొంతమంది పోలీస్ అధికారులు కలిసి, వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అదనపు ఎస్పీ వాల్మీకి, ఆయన రచనల గొప్పతనాన్ని కొనియాడారు. శ్రీరాముడి జీవితచరిత్రను రామాయణం వంటి మహాకావ్యంగా రాసి, మనకు అందించిన మహానుభావుడు వాల్మీకి అని, ఆయనను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్‌ఐలు ఎస్.గోపాలనాయుడు, రమణమూర్తి, ఎస్‌ఐ వాసుదేవ్, ఆర్‌ఎస్‌ఐలు శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రసాద్, నీలిమ, నారాయణరావు, కేశవరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపఖజానా అధికారి కార్యాలయం మార్పు

విజయనగరం అర్బన్: తోటపాలెం ఇందిరానగర్ ప్రాంతంలో అద్దె భవనంలో ఉన్న ఉప ఖజానా అధికారి విజయనగరం అర్బన్ కార్యాలయం మార్పు జరిగిందని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఆర్.ఎ.ఎస్.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరు బంగ్లా వెనక దండుమారమ్మ కోవెల దారిలోని జిల్లా ఆర్థిక కార్యకలాపాల భవన సముదాయానికి మార్చామన్నారు. పింఛన్‌దారులు చిరుమానా మార్పును గమనించాలని కోరారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2022లో నమోదైన మూడు దొంగతనాల కేసుల్లో నిందితుడు కడియాల రఘురామ్‌కు పది నెలల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ విజయనగరం ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి బి.రమ్య తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణ పరిధిలో జరిగిన దొంగతనాలకు సంబంధించి, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈక్రమంలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, నేరారోపణలు రుజువు కావడంతో జైలు శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురం దగ్గరున్న వేగావతి నది ఇసుక మేటల్లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికుల ద్వారా పోలీసులు శనివారం గుర్తించారు. మృతుడి వివరాల కోసం ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఉన్న విజయలక్ష్మి మెస్‌లో పనిచేసే వంట మాస్టర్ వద్దాది పోలారావు(37)గా గుర్తించారు. మృతుడిది పట్టణంలోని మహారాణిపేట దగ్గరున్న చిన్నచెరువు గట్టు ప్రాంతమని, ఈ వ్యక్తి ఎలా చనిపోయాడన్న విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు.

రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరండి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరి, సమాజ సేవకు ముందుకు రావాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. స్మార్ట్‌ఫోన్‌లో రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్టర్ కావాలన్నారు. కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ కార్యనిర్వాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదు విషయంలో మన జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరడమనేది సేవా తత్పరత, సమాజం పట్ల బాధ్యతకు నిదర్శనమన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును రూ.65 లక్షలతో ఆధునీకరించడం జరుగుతుందన్నారు. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్సును సమకూర్చినట్లు తెలిపారు. చీపురుపల్లిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ తరఫున కేన్సర్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

డిసెంబరు నాటికి 10 లక్షల మంది..

ఇండియన్ రెడ్‌క్రాస్ ఏపీ శాఖ జనరల్ సెక్రటరీ ఎ.కె.పరీడా మాట్లాడుతూ సేవకు చిరునామాగా ఉన్న రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదు కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడుతున్నామన్నారు. డిసెంబరు నాటికి రాష్ట్రంలో దాదాపు రూ.10 లక్షల మంది వలంటీర్లను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రధానంగా ఏపీ రెడ్‌క్రాస్ యాప్‌ను పెద్దఎత్తున డౌన్‌లోడ్ చేయించి, దానిలో రిజిస్టర్ చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఒక్క మన రాష్ట్రంలోనే యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, వాతావరణ మార్పుల పట్ల రెడ్‌క్రాస్ యాప్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, వేలాది మంది కార్మికులకు ప్రథమ చికిత్సలో శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ ఏపీ శాఖ చైర్మన్ ఎ.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా పేదలకు, తలసేమియా, హెచ్‌ఐవీ, కేన్సర్ రోగులకు ఉచితంగా రక్తం అందిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో విశేషమైన సేవలను అందించామన్నారు. వందేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని సుమారు 1.6 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, రెడ్‌క్రాస్ ఏపీ శాఖ వైస్ చైర్మన్ పి.జగన్‌మోహన్ రావు, కోశాధికారి సి.వెంకటేశ్వర రెడ్డి, జిల్లా చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డీవో ఎం.వి.సూర్యకళ, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు ఎస్.వి.సూర్యనారాయణ, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రారంభం

- ప్రదర్శన, విక్రయాలకు 18 రాష్ట్రాల నుంచి 251 స్టాల్స్ ఏర్పాటు
- హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తు ప్రదర్శన



స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: అఖిల భారత డ్వాక్రా బజార్ పేరుతో దేశ వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన, విక్రయాలశాల శనివారం పట్టణంలో ప్రారంభమయ్యాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డును ఆనుకొని మాన్సాస్ గ్రౌండ్స్‌లో ఈ బజార్‌ను విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. సరస్ (సేల్స్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిషన్స్ సొసైటీ) పరిధిలోని వివిధ రాష్ట్రాలకు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులతో సుమారు 251 స్టాల్స్‌ను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రాముఖ్యమున్న సాంప్రదాయ కళా వస్తువులు అన్ని ప్రాంతాలకు విస్తరించడానికి ఈ ప్రదర్శనలు వినియోగపడతాయని మరోవైపు పొదుపు మహిళల ఉత్పత్తులను ప్రోత్సహించడం వల్ల వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. పైడితల్లి అమ్మవారి పండుగ, విజయనగరం ఉత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వంతో పాటు నాబార్డ్, మెప్మా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిడ్బి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన వచ్చే నెల 8వ తేదీ వరకు ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, మేయర్ వి.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, మెప్మా పీడీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన వస్తువులివే..

ఎగ్జిబిషన్‌లో వెదురు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తులు, చీరలు, జ్యూవెలరీ, హ్యాండ్ లూమ్, డ్రై ఫ్లవర్స్, హ్యాండీ క్రాఫ్ట్, బెడ్ షీట్స్, గృహాలంకరణ వస్తువులు, హ్యాండ్‌లూమ్స్, కుర్తాలు, రెడీమేడ్ దుస్తులు, హ్యాండీ క్రాఫ్ట్, ఆభరణ వస్తువులు, మసాలా దినుసులు ప్రదర్శిస్తారు. అలాగే కార్పెట్లు, డ్రైఫ్రూట్స్, ఆర్టిఫీషియల్ జ్యూవెలరీ, హ్యాండ్లూమ్స్ ఉత్పత్తులు, జ్యూట్ డోర్ ఉత్పత్తులు, పోచంపల్లి, గద్వాల్ వస్త్రాలు అందుబాటు ధరల్లో లభిస్తాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రుచులతో పాటు ఇతర రాష్ట్రాల సాంప్రదాయక వంటకాలతో ఫుడ్ కోర్టులను, మరోవైపు సందర్శకుల పిల్లలను ఆహ్లాద పరిచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించే వేదికను ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసారు.